క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: దేవరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గౌరీపట్నం ఇండస్ట్రియల్ ఫీడర్, దుద్దుకూరు రూరల్ ఫీడర్లపై ఆర్‌డీఎస్‌ఎస్ పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగ దారులకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తు న్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఈ పీడర్ల పరిధిలోని వ్యవసాయ బోర్లకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఇస్తామని తెలిపారు.

ముంపు పొలాల పరిశీలన

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూ డెం, డి.ముప్పవరం, సింగవరం, కంసాలిపా లెం, రావిమెట్ల గ్రామాల్లో నీట మునిగిన నారు మడులు, వరిచేలను మండల వ్యవసాయ ధికారి జి.సత్యనారాయణ మంగళవారం పరిశీ లించారు. నీటి ముంపును గురవకుండా తీసు కోవాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. కౌలు రైతులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు నమోదు చేయించుకోవాలని సూచించారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో కలుపు మందు పిచికారీ



పెద్దేవం చెరువులోని గుర్రపు డెక్కపై కలుపు మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామం లోని పెద్ద సుగంధి చెరువు మొత్తం గుర్రపు డెక్క అల్లుకుపోయింది. దీంతో మంగళవారం డ్రోన్ సాయంతో ఆ చెరువులో కలుపు మందు పిచికారీ చేసి గుర్రపు డెక్క తొలగించే పను లను ప్రారంభించారు. ఇటీవల పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ తదితరులు చేసిన పంచాయతీ తీర్మానం మేరకు డ్రోన్ సాయంతో గుర్రపుడెక్క తొలగింపు చేపట్టినట్లు ఆ పంచాయతీ కార్యదర్శి ఆలేఖ్య సువర్చల తెలిపారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: డెల్టా పరిధిలో వర్షాలు కురవడం తో ఖరీఫ్ సాగు అవసరాలకు సమృద్ధిగా నీరందు తోంది. దీంతో రైతుల అవసరాల మేరకు డెల్టా కాలువలకు నీటి విడుదలను అధికారులు తగ్గిం చారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి మంగళ వారం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే మధ్య డెల్టాకు 1200, తూర్పు డెల్టాకు 3,000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని ఏలూరు కాలువకు 496, నరసాపురం కాలువకు 1,161, ఉండి కాలువకు 500, అత్తిలి కాలువకు 103 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

ముంపు నుంచి పంటలను కాపాడండి

కొవ్వూరు: వర్షాకాలం ప్రవేశించినందున కొవ్వూరు నియోజకవర్గంలో పూడుకుపోయిన కాలువలను ప్రక్షాళన చేసి ముంపు బారి నుంచి పంటలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కేఎస్ జవహర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా ఇసుక పాలసీ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

లంక పంట .. గోదారి మేత

- సమీపించిన వరదల సీజన్
- బిక్కుబిక్కుమంటున్న లంక రైతులు
- మండలంలో 3 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు
- ముంచెత్తితే అన్నదాతలకు భారీ నష్టం



గోదావరి వరదకు ఖండవల్లి వద్ద మునిగిన లంక పంటలు (ఫైల్)



ఖండవల్లి వద్ద కళకళలాడుతున్న అరటి, కొబ్బరి పంటలు

పెరవలి: గోదావరికి వరదల సీజన్ సమీపించింది. లంక రైతుల గుండెలు బిక్కుబిక్కుమంటున్నాయి. తాము కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలను వరద గోదావరి ఏ క్షణంలో ముంచెత్తుతుందోనని భీతిల్లుతున్నారు. నది ఎగువ భాగంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వారిని కలవరపెడుతున్నాయి. సాధారణంగా ఏటా జూలై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకూ గోదావరి నదికి వరదలు వస్తుంటాయి. ఈ నదికి ఉధృతంగా వచ్చే వరదలు సారవంతమైన లంక భూముల్లో సాగవుతున్న వివిధ రకాల ఉద్యాన, పూల తోటలను ముంచెత్తుతాయి. అందుకే ఈ ప్రాంతంలో 'లంక పంట.. గోదావరి మేత' అనే సామెత ఉండనే ఉంది. వరద వచ్చినప్పుడల్లా లంక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పోనీ వరదల సీజన్లో పంటలు వేయకుండా ఉండామంటే బతుకు తెరువు ఉండదని వారు పేర్కొంటున్నారు. కష్టమైనా నష్టమైనా గోదావరి లంకల్లో పండే పంటలే తమకు జీవనాధారమని చెబుతున్నారు.

మండలంలోని 10 గ్రామాల్లో..

పెరవలి మండలంలోని పది గ్రామాల్లోని దాదాపు మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో గోదావరి నది వెంబడి లంక భూములు విస్తరించి ఉన్నాయి. గ్రామాల వారీగా ఖండవల్లిలో 800, కాకరపర్రులో 600, తీపర్రులో 400, కానూరు, కానూరు అగ్రహారాల్లో 300, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టల వేమవరం లలో 500, ముక్కామలలో 350, ఉసులుమర్రులో 50 ఎకరాల్లో లంక భూములు ఉన్నాయి. ఇవన్నీ బాగా సారవంతమైన భూములే. వేసవిలో కూడా నీటి వసతికి ఇబ్బంది లేదు. ఈ భూముల్లో రైతులు ప్రధానంగా కొబ్బరి, కోకో, అరటి, పసుపు, కంద, కూరగాయలు, వివిధ కూరగాయలు, పూల తోటలు, బొప్పాయి, తమలపాకులు, మునగ, జామ వంటి పంటలు వేస్తుంటారు. కేవలం కూరగాయల పంటల నుంచి కొంత ఆదాయాన్ని పొందినా, గోదావరికి వరదలు వస్తే మిగిలిన పంటలు ముంపు బారిన పడతాయని రైతులు వివరిస్తున్నారు. తాత్కాలిక పంటల్లైన కూరగాయలు, పూల తోటల నుంచి ఆదాయం లభించినప్పటికీ దీర్ఘకాలిక పంటలైన అరటి, కంద, పసుపు, తమలపాకులు, మునగ తోటలు ముంపులో చిక్కుకుని దెబ్బతింటున్నాయని చెబుతున్నారు. ఐదుమించు వరదల సమయంలోనే ఈ పంటలు దిగుబడికి వస్తాయి. గోదావరికి కన్నెర్ర జేస్తే తాము పెట్టిన పెట్టుబడితో సహా పంట మొత్తం ఊడ్చుకుపోతుందని వివరిస్తున్నారు.

వరద వస్తే రూ.50 కోట్ల నష్టం

గోదావరికి వరద వస్తే కంద, పసుపు, అరటి, తమలపాకులు, బొప్పాయి, కూరగాయలు, మొక్క జొన్న వంటి పంటలు పూర్తిగా నాశనం అవుతాయి. ఫలితంగా లంక రైతులకు దాదాపు రూ.50 కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని అంచనా. వరద రాకపోతే ఆ మేరకు రైతుల పంట పండినట్లే.

ఏయే పంటలు ఎంతెంత విస్తీర్ణంలో..

గోదావరి లంకల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో అరటి సాగవుతోంది. ఇక కొబ్బరి తోటలు 25, తమలపాకులు తోటలు 30, బొప్పాయి 35, వివిధ రకాల కూరగాయలు 150, కంద 40, పసుపు 30, మొక్కజొన్న 60, పూలు 150, కోకో 30, ఆయిల్‌పామ్ 20, జామతోటలు 30, పచ్చగడ్డి 300 ఎకరాల్లో ప్రస్తుతం సాగులో ఉన్నాయి. అలాగే మరో 100 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేస్తున్నారు.

చేతికి వస్తుందో.. లేదో



పంటలు బాగా పండి, మార్కెట్లో గిట్టుబాటు ధర లభిస్తున్న తరుణంలోనే గోదావరికి వరదలు వచ్చి తుడిచి పెట్టుకు పోతుంటాయి. వరద రాకపోతే పంట దక్కుతుంది. ప్రస్తుతం నేను రెండు ఎకరాల్లో కంద, రెండు ఎకరాల్లో అరటి వేశాను. ఈ ఏడాది పంట చేతికి వస్తుందో.. లేదో..

–రాయుడు లీలాబాబు, లంక రైతు, ఖండవల్లి

రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టాను



నేను మూడెకరాల లంక భూమి కౌలుకు తీసుకుని కంద, అరటి వేశాను. పెట్టుబడి రూ.4 లక్షలు అయ్యింది. గోదావరికి వరద రాకపోతే పంట దక్కుతుంది. లేకపోతే నష్టాలు తప్పవు.

–అరిగెల దుర్గారావు, కౌలు రైతు, ఖండవల్లి

సాధ్యమైనంత త్వరలో టిడ్కో ఇళ్లు అప్పగిస్తాం

కొవ్వూరు: అసంపూర్తి పనులు పూర్తి చేయించి టిడ్కో లబ్ధిదారులకు సాధ్యమైనంత త్వరలోనే ఇళ్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. పట్టణం లోని టిడ్కో గృహాల సముదాయంలో జరుగుతున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. తాగునీటి పైప్‌లైన్ పనులను ఇప్పటికే పూర్తి చేశారన్నారు. బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రస్తుతం ఎర్త్ వర్క్ చేస్తున్నారని చెప్పారు. సిమెంట్ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉందన్నారు. ఇవన్నీ కాతం అసంపూర్తి పనులు పూర్తి చేయించే విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేయించామన్నారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దాయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

దేవరపల్లి: సంగాయగూడెం గ్రామ సచివాలయానికి స్థానిక దాత సుంకవల్లి వెంకట రామారావు (రాము) తన తండ్రి సూర్యనారాయణ జ్ఞాపకార్థం మంగళవారం వాటర్ కూలర్ డిస్పెన్సర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి ఉషారాణి, కరుటూరి శ్రీనివాస్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారం



తాళ్లపూడిలో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

తాళ్లపూడి: విద్యార్థులు మత్తు పదార్థాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం స్థానిక బాలికోన్నత విద్యాసంస్థల ఐటీఐ, డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు మద్యం, సిగరెట్, గంజాయి వంటి వాటికి బానిసైతే మానసికంగా, శారీరకంగా నాశనం కావడమే గాకుండా సమాజంలో గుర్తింపును కూడా కోల్పోతారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళి, విద్యాసంస్థల అధ్యక్షుడు డి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కూడా తహసీల్దార్ అవగాహన కార్యక్రమం కల్పించారు. ఎంఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు



ఉండ్రాజవరంలో రోడ్డుపై నిలిచిపోయిన డ్రైనేజీ మురుగు

ఉండ్రాజవరం: స్థానిక వెలగదుర్రు రోడ్డు, ఐదో వార్డు తిరపయ్య గారి వీధిలోని డ్రైనేజీలో మురుగు దిగువకు ప్రవహించడం లేదు. దాంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వెలగదుర్రు రోడ్డుకు మధ్యలో ఉన్న పైపు (తూర) మట్టితో పూడుకుపోవడంతో ఆ డ్రైనేజీలోని మురుగు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. ఈ మురుగు నీరంతా రోడ్డుపైకి చేరడంతో దోమలు, ఈగలు వ్యాపించి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈ వీధి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పూడుకుపోయిన తూరలోని మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ వీధి వాసులు పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

ర్యాంపులో ఇసుక విక్రయాలు ప్రారంభం

- జిల్లా పరిధిలోనే రవాణాకు అనుమతి
- ఆధార్ కార్డు ఆధారంగా ఒక్కొక్కరికి 20 టన్నులు



ఔరంగాబాద్ ఇసుక ర్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: స్థానిక ఔరంగాబాద్ ఇసుక ర్యాంపును మంగళవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ర్యాంపులో ఇసుక తవ్వకాలు, విక్రయాలను నిలిపివేశారు. గోదావరి నదిలో వరద పెరుగుతున్న నేపథ్యంలో ఈ ర్యాంపులోని ఇసుక నిల్వల తరలింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ఇసుక అమ్మకాలను లాంఛనంగా ప్రారంభించారు. టన్ను రూ.420 చొప్పున విక్రయించనున్నట్లు తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. ఇసుక కావాల్సిన వారు బిల్డింగ్ ప్లాన్ కానీ, సచివాలయ కార్యదర్శి నుంచి లెటర్ గానీ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది పెద్ద సమస్య కావడంతో లారీ యాజమానులు, పడవ ర్యాంపుల నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఆధార్ కార్డు ఆధారంగా ఒక్కొక్కరికి గరిష్టంగా 20 టన్నుల ఇసుక అందిస్తున్నారు. ఇసుక రవాణాను జిల్లా పరిధిలో మాత్రమే అనుమతించారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, డిప్యూటీ తహసీల్దార్ అజయ్, కౌన్సిలర్ కండెల్లి రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు పడవల్లో ఇసుక ర్యాంపును ఎంపీపీ కాకర్ల నారాయుడు లాంఛనంగా పూజలు చేసి,కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు.డిప్యూటీ తహసీల్దార్ కమల్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపండి



దిబిడి గ్రామంలో పారిశుధ్య పరిస్థితిని కలెక్టర్ ప్రశాంతికి వివరిస్తున్న సర్పంచ్

కొవ్వూరు: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అం త్యంత శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. దిబిడి గ్రామంలో మంగళవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. గ్రామ ప్రధాన వీధుల్లో పారిశుధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ, పంచాయతీ సిబ్బందికి సూచించారు. గత శనివారం గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకులను ఎన్ని శుభ్రం చేశారు, ఏ సచివాలయ సిబ్బంది ఏ ట్యాంకును పరిశీలించారో అడిగి తెలుసుకున్నారు. తాగు నీటి ట్యాంకులు పరిశుభ్రతతో పాటు గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సమగ్రంగా చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, నిమెంటు రోడ్లు నిర్మించిన సమయంలోనే డ్రైనేజ్ నిర్మాణం కూడా చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైనుల్లో పూడికలు తొలగింపు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలంగుల లక్ష్మణరావు, ఎంపీడీఓ కె.సుశీల, ఈవోపీఆర్‌ అండ్ ఆర్‌డీ శర్మ, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించండి

తాళ్లపూడి: మంచి నీటి ట్యాంకులు శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లి, నిర్ణీత సమయం వరకూ ఆరబెట్టాక ప్రజలకు నీటిని సరఫరా చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలోని వేగేశ్వరపురం గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. గ్రామంలోని డ్రైనేజీ నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలు, వాటర్ ట్యాంక్ నిర్వహణ వంటి అంశాలపై సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. అంగన్‌వాడీలు, మంచి నీటి ట్యాంకుల నిర్వహణకు చేపట్టిన చర్యల సమాచారాన్ని అందజేయాలని కలెక్టర్ ప్రశాంతి సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలోని మేదరపేట మార్గంలో నిలిచిపోయిన నీటిని దిగువకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టీవీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి డీసీహెచ్ శ్రీనివాస్, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కిశోర బాలికలు, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న నోడల్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి

నల్లజర్ల: చట్టాలపై కిశోర బాలికలు, మహిళలు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ ఏలూరు ఆర్జేడీ కార్యాలయ నోడల్ ఆఫీసర్ కె.స్వరాజ్యలక్ష్మి సూచించారు. కిశోర బాలికలు, మహిళలకు చట్టాలపై స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆపద సంభవిస్తే కిశోర బాలికలు టోల్ ఫ్రీ నంబర్ 1098కు, మహిళలైతే ఉమెన్స్ హెల్ప్‌లైన్ 181కు సంప్రదించాలన్నారు. పోక్సో కేసులు, కిడ్నాప్, బాలికల అక్రమ రవాణా, యాసిడ్ దాడుల బాధిత మహిళలకు సఖీ వన్ స్టాప్ సెంటర్ ఆశ్రయం కల్పిస్తుందన్నారు. దీని ప్రధాన కార్యాలయం రాజమహేంద్రవరంలో ఉందన్నారు. ఇలాంటి బాధితులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి గైనిక్ విభాగంలో సౌజన్య–94945 47775ను సంప్రదించాలన్నారు. నిరాదరణకు గురైన మహిళల్ని పునరావాసంలో, విజయవాడల్లో ఏర్పాటు చేసిన శక్తి సదనాల్లో చేరవచ్చన్నారు. అనాథలుగా వదిలేసిన శిశువులను శిశు గృహాల్లో ఉంచుతామన్నారు.

మౌలిక వసతుల బాధ్యత మనందరిదీ

- గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- అధికారులు, ప్రజాప్రతినిధులతో నియోజకవర్గ స్థాయి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: గ్రామాల్లోని ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో మంగళవారం దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాల్లో సమీక్ష జరిపారు. ఎమ్మెల్యే వెంకట్రాజు మాట్లాడుతూ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. గ్రామాల్లోని చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. జఠిలమైన సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. ఒక్కో మండలానికి ఒక ప్రధాన సమస్య ఉంటుందని, వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యదర్శులు, ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. శాఖల వారీగా అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. సమావేశంలో దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు పొట్ల స్వర్ణలత, కాకులపాటి లలిత, చిగురుపల్లి శ్యామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబమే ఆ గుడి నిర్మించింది



తాళ్లపూడిలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సుంకావల్లి కుటుంబీకులు, సర్పంచ్, ఎంపీపీ తదితరులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామంలో గోదావరి తీరంలోని ఆంజనేయ స్వామి ఆలయాన్ని తామే నిర్మించామని గ్రామానికి చెందిన సుంకావల్లి కుటుంబీకులు స్పష్టం చేశారు. ఆ కుటుంబీకులతో పాటు, వారికి మద్దతుగా సర్పంచ్ కొమ్ము రెడ్డి వరహరామారావు, ఎంపీపీ కొవ్వూరి పోశిరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు తదితరులు మంగళవారం తాళ్లపూడి వెళ్లి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1966కు ముందు దీనికి సంబంధించిన ప్రభుత్వ భూమి వివరాలు, పూర్వం నుంచి ఈ ఆలయం తమ వంశస్తుల నిర్వహణలోనే ఉందని, పాత గుడి స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించామని సంబంధిత పత్రాలు అందజేశారు. పూర్వం నుంచి ఈ ఆలయం తమ వంశస్తుల నిర్వహణలోనే ఉందని, పాత గుడి స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించామని సంతకాలతో వంశస్తుల తహసీల్దార్‌కు వివరించారు. అయితే ఈ ఆలయం తమకు చెందినది అని చెబుతూ, ఆలయ కరెంట్ కనెక్షన్ తొలగించాలంటూ ఇటీవల కొందరు అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ ఫిర్యాదు చేస్తున్నారని సంతకాలు వంశస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆరోగ్యం చెంతనే అపరిశుభ్రం



మునిపల్లి విలేజ్ క్లినిక్ వద్ద అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

నిడదవోలు రూరల్: గ్రామీణులకు మరింత చేరువగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండు వేల జనాభాకు ఒకటి చొప్పున విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటి నిర్వహణను అపుడే గాలి కొదిలేసింది. దీంతో రోగులతో వచ్చిన వారు అపరిశుభ్ర పరిస్థితుల మధ్య కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. నిడదవోలు మండలం మునిపల్లిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ చుట్టూ వర్షంగా ఉండడంతో వర్షపు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పిచ్చిమొక్కలు కూడా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఆరోగ్య కేంద్రాల వద్ద పరిశుభ్రతకు పెద్దపీట వేసేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దేవతా వృక్షం కొమ్మల నరికివేత

తప్పుబట్టిన బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ



గోష్పాద క్షేత్రంలో కొమ్మలు పూర్తిగా నరికివేయడంతో మోడుగా కనిపిస్తున్న రావి చెట్టు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని భారీ దేవతా వృక్షం (రావి చెట్టు)న్ని మునిసిపల్ సిబ్బంది నరికి వేయడాన్ని ఆధ్యాత్మికవేత్తలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇటీవల ఈ భారీ వృక్షం కొమ్మ విరిగి పడింది. ఆ కొమ్మ తొలగింపుతో పాటు ఆ చెట్టుకు ఉన్న భారీ కొమ్మలన్నింటినీ సిబ్బంది మంగళవారం నరికి వేశారు. క్షేత్రంలో 120 ఏళ్ల చరిత్రగల దేవతా వృక్షాన్ని ఈ విధంగా తొలగించడంపై స్థానిక బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్ వచ్చి పరిశీలించకుండా దేవతా వృక్షం కొమ్మలను నరికి వేయడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. వాల్తా చెట్లను దుర్వినియోగా పరచిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక కొమ్మను తరలిస్తే సొమ్ము రాదని, మొత్తం కొమ్మలను నరికితే లారీ కలప వస్తుందని ఇక్కడి సిబ్బంది చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ వృక్షాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మురళీకృష్ణ కోరారు. ఈ చెట్టుపై వేలాది పక్షులు ఆవాసం పొందుతున్నాయి. నిత్యం ఎంతోమంది ఈ చెట్టు నీడన కూర్చొంటున్నారు. ఎన్నో సినిమాలను ఈ చెట్టు వద్ద చిత్రీకరించారు. పవిత్ర గోష్పాద క్షేత్ర ప్రాముఖ్యతను దెబ్బతీసే ఇలాంటి చర్యలను మానుకోవాలని ఆయన హితవు పలికారు.